

● సభలో ప్రసంగిస్తున్న అమిత్ షా

● హాజరైన రైతులు, పార్టీ శ్రేణులు

ఇందూరు పసుపునకు ప్రపంచ గుర్తింపు

- రైతులు పసుపు బోర్డు కోసం 40 ఏళ్లు పోరాటం చేశారు
- ప్రధాని మోదీ ఇచ్చిన హామీకి అనుగుణంగా పసుపు బోర్డు ఏర్పాటు చేశారు
- రాష్ట్రంలో అవినీతి తగ్గాలంటే బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలి
- పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో హోంమంత్రి అమిత్‌షా
- అమిత్ షా సభ విజయవంతంతో బీజేపీ శ్రేణుల్లో జోష్

నిజామాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పసుపు రాజధానిగా ఇందూరు మారనుందని, ఇక్కడి పసుపు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. జిల్లా రైతులు పసుపు బోర్డు కోసం 40 ఏళ్ల పాటు పోరాటాలు చేశారని, గత ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా ప్రధాని మోదీ రైతులకు పసుపు బోర్డుకు హామీ ఇచ్చి నెరవేర్చారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అ న్నారు. ఆదివారం నగరంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభించిన ఆయన పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కిసాన్ సమ్మేళనంలో మాట్లాడారు. పసుపు రైతుల సంక్షేమానికి ప్రధాని కట్టుబడి ఉండటమే కాకుండా ఇచ్చిన మాట ప్రకారం నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్ర రైతులే కాకుండా ఇతర రాష్ట్రాల రైతులకు మేలు చేస్తుందన్నారు. పసుపునకు సంబంధించిన సాంకేతికత పరిజ్ఞానాన్ని ఇక్కడి రైతులకు అందించడమే కాకుండా నిజామాబాద్ పసుపు రాజధానిగా మారుతుందన్నారు. జిల్లాలో ఆర్గానిక్ పసుపు ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. భారత్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ శాఖలను కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడి పసుపును ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా చూస్తామన్నారు. జిల్లాలో పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు అయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తామన్నారు. రైతులకు పలు రకాల పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు మార్కెటింగ్ టెక్నిక్స్‌ను నేర్పిస్తామన్నారు. సహకార శాఖల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ సంఘాలకు నిధులను అందించడంతో పాటు పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు లక్ష కోట్ల నిధులను బడ్జెట్‌లో కేటాయించామన్నారు. రైతులకు పెట్టుబడి కింద సంవత్సరానికి 6వేలు అందించడంతో పాటు ఎరువులను సబ్సిడీమీద అందిస్తున్నామన్నారు. రైతులకు బీమాను కల్పిస్తున్నామన్నారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, నక్సలిజం అంతమొందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పాక్‌లో జరిపిన సర్జికల్ స్ట్రైక్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాల వల్లనే సాధ్యమైందన్నారు. నక్సలిజం వచ్చే సంవత్సరం మార్చి 30లోపు అంతమొందించే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో అవినీతి ఎక్కువగా జరిగిందన్నారు. కాళేశ్వరం, ధరణి ద్వారా కోట్ల రూపాయలను కేసీఆర్ కుటుంబం కొల్లగొట్టిందన్నారు. ప్రజలు అవినీతిని సహించలేక బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను తీసుకువచ్చిన ఫలితం మాత్రం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే రీతిలో కొనసాగుతుందన్నారు. అవినీతి రాష్ట్రంలో రూపుమాపలేదన్నారు. తెలంగాణ ఢిల్లీ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందన్నారు. రాష్ట్రంలో అవినీతి తగ్గాలంటే బీజేపీ ప్రభుత్వం ఏర్పడాలన్నారు. రైతులందరూ సహకరిస్తే ఇది సాధ్యమన్నారు. మీరు బీజేపీకి మద్దతు ఇస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధిని చేస్తామని అమిత్‌షా అన్నారు. అభివృద్ధి కోసం బీజేపీకి పూర్తిస్థాయిలో అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే ఆదివాసీలు, దళితులు, రైతులు, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని అన్నారు. రాజకీయాల్లో ఎంతో ఎత్తు ఎదిగిన డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు నివాళులు అర్పిస్తున్నామని ఆయన ప్రకటించారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన జీవితం కూడా బోర్డు ఏర్పాటు ద్వారా ధన్యమైందన్నారు. బోర్డు కోసం బీజేపీ ఎంపీలు కృషి చేశారని అన్నారు.



మాట్లాడుతున్న అమిత్ షా.. వేదికపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు అర్వింద్, ఈటల




అమిత్ షాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, పోలీసు కమిషనర్

అమిత్‌షాకు ఘనస్వాగతం పలికిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కేంద్ర హోంమంత్రి ఆదివారం మధ్యాహ్నం 2.15నిమిషాలకు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెలికాప్టర్‌లో రాగా హెలిప్యాడ్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, తదితరులు ఘన స్వాగతం పలికారు.



సభకు తరలి వస్తున్న రైతులు, పార్టీ కార్యకర్తలు

సభ సక్సెస్‌తో కార్యకర్తల్లో జోష్

అమిత్‌షా జిల్లా పర్యటన సక్సెస్‌పై బీజేపీ క్యాడర్‌లో జోష్ పెరిగింది. కేంద్ర హోంమంత్రి జిల్లాకు రావడంతో పాటు పసుపు బోర్డు ప్రారంభించారు. రైతులతో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్నారు. జోష్ నింపే విధంగా ప్రసం గించారు. నక్సలైట్ల హింస నుంచి పసుపు బోర్డు ఏర్పాటు వరకు మాట్లాడిన సమయంలో సభలో హాజరైన క్యాడర్ రైతుల ద్వారా మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. వారు మద్దతు ఇస్తారా లేదా అని అడిగి జోష్ నింపారు. ఈ సభ కోసం పది రోజులుగా ఎంపీ అర్వింద్‌తో పాటు ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్‌కులాచారి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మండల నేతలు పెద్ద ఎత్తున కృషి చేశారు. సభకు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా చూశారు. జిల్లా నుంచే కాకుండా జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు.



2030 నాటికి మిలియన్ డాలర్ల పసుపు ఎగుమతి!

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తి ప్రధాని మోదీ
- కేంద్రంతో పోరాడి ఎంపీ అర్వింద్ బోర్డును సాధించారు
- వచ్చే నాలుగేళ్లలో ఇందూరు పసుపునకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు
- భారత్ ఆర్గానిక్, కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్టు కార్యాలయాలు జిల్లాలోనే
- పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



స్టాళ్లను పరిశీలి స్తున్న దృశ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అమిత్ షా, చిత్రంలో మంత్రి తుమ్మల

సుభాష్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగేళ్లలో ఇందూరు పసుపునకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని, 2030నాటికి మిలియన్ డాలర్ల పసుపు ఎగుమతి లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మోదీ పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. అంతర్జాతీయ ఎగుమతుల వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారత్ కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్, ఆర్గానిక్ పంటను ప్రోత్సహించేందుకు భారత్ ఆర్గానిక్ కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్ సంస్థలను నెలకొల్పిందని గుర్తు చేశారు. ఈ ప్రాంత రైతులకు మరింత మేలు చేకూరేలా ఎక్స్‌పోర్టు లిమిటెడ్ సంస్థల శాఖలను జిల్లాలోనే ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందూరు జిల్లా పసుపునకు రాజధానిగా కాబోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేసి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డును తీసుకువచ్చారన్నారు. ఇక్కడి పసుపునకు జియో ట్యాగింగ్ చేస్తున్నామన్నారు. పసుపు రిసెర్చ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. 2025లో పసుపుకు అత్యధికంగా 19వేల రూపాయల ధర పలికిందన్నారు. రానున్న మూడు, నాలుగు సంవత్సరాల్లో పసుపు ధర 6నుంచి 7వేలు అధికం కానుందన్నారు. నిజామాబాద్ రైతులు పసుపు సాగు చేస్తున్నా బయటి మార్కెట్‌లో గుర్తింపు అనుకున్నస్థాయిలో దక్కలేదని, పసుపు బోర్డుతో ఇక్కడి రైతుకు గుర్తింపు దక్కుతుందన్నారు. ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఎక్స్ పోర్టులను పసుపు బోర్డు చేస్తుందన్నారు. పసుపు బోర్డు ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు మార్కెటింగ్, ఎక్స్‌పోర్టు, బ్రాండింగ్ వంటివి మెరుగు పర్చుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర పసుపు బోర్డు లోగోను రిమోట్ కంట్రోల్ ద్వారా అమిత్ షా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాజసభ సభ్యుడు లక్ష్మణ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, ఎంపీ ధర్మపురి అర్వింద్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పసుపు బోర్డు సెక్రెటరీ భవాని శ్రీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించాలి

: తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి



కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రైతును రాజుగా చేస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసిందని రైతును రాజుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే ఆర్థిక భారం ఉన్నప్పటికి లక్ష కోట్ల రూపాయలను రైతాంగ సమస్యలమీద ఖర్చుపెట్టామని తెలిపారు. రైతు భరోసా లాంటి కార్యక్రమాన్ని

మిగతా 8వ పేజీలో...



భద్రత నిర్వహిస్తున్న ఆక్టోపస్ బృందాలు

భారీ బందోబస్తు మధ్య హోం మంత్రి పర్యటన

- ప్రశాంతంగా పర్యటన ముగియడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన సందర్భంగా నగరంలో ఆదివారం భారీ బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచే పోలీసు బలగాలు కేంద్ర హోం మంత్రి పర్యటించే ప్రాంతాల్లో మొహరించారు. జిల్లా కలెక్టరేట్‌లో కేంద్ర హోంమంత్రి హెలికాప్టర్ ల్యాండ్ అయినప్పటి నుంచి తిరిగి పర్యటన ముగిసేంతవరకు కేంద్ర బలగాలతో పాటు పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు నగరానికి చేరుకున్న హోంమంత్రి కాన్వాయి సందర్భంగా ఆయన పర్యటించే ప్రాంతాల్లో ముందుగానే ట్రాఫిక్‌ను నియంత్రించారు. సుమారు 1300లకు పైగా మంది పోలీసులతో పాటు ఆక్టోపస్, స్పెషల్ పార్టీ, బీడీ టీమ్స్, డాగ్‌స్క్వాడ్ టీమ్‌లతో బందోబస్తు చేశారు. బందోబస్తును సీపీ సాయి చైతన్యతో పాటు కామారెడ్డి అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు పర్యవేక్షించారు. కేంద్ర హోంమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు కమ్యూనిస్టు పార్టీల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఆయన పర్యటన ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

మంత్రి సీతక్కకు ఘనస్వాగతం

ఇందల్వాయి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటి సారిగా జిల్లా కేంద్రానికి వస్తున్న మంత్రి సీతక్కకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. మంత్రి సీతక్కకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా బల్మూరి వెంకట్

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను నియమించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులకు రాష్ట్రంలోని పార్లమెంట్ స్థానాలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఇన్‌చార్జిలుగా నియమించారు.



నగరంలో బోనాలకు పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా బోనాల జాతర



బోనం ఎత్తుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసాన్ని పురస్కరించుకొని ప్రతియేటా అమ్మవారికి అందించే బోనాల జాతరను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన బోనాల పండుగలో పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బోనాన్ని నెత్తిన పెట్టుకొని ఊరేగిం పుగా బయలుదేరారు. బోనాలు ముదిరాజ్ సంఘం నుండి బయలుదేరి పలు వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి పోచమ్మ గల్లిలోగల అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో చల్లగా ఉండాలని ఆశాడమాసంలో బోనాల పండుగను నిర్వహించడం తెలంగాణ సాంప్రదాయంలో ఉందని అన్నారు. ఇందూరు పట్టణంలో మొదటి బోనాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జాలిగం రాందాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సురేందర్, సుధాకర్, శ్రీధర్, సంతోష్, శ్రావణ్, ఆంజనేయులు, భాస్కర్, శ్రీనివాస్, శంకర్, జగన్‌వర్మ, రవిశంకర్, గణేష్, గోపి, నాగార్జున, గాజుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఎస్‌ఎఫ్‌ను పునరుద్ధరించాలి

● కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వినతి



వినతి పత్రం అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ సహకార చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవ సమావేశంలో కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో నిజామాబాద్ కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్ మాత్రమే సహకార చక్కెర కర్మాగారం అని తెలిపారు. ఈ కర్మాగారం 1958లో స్థాపించడం జరిగిందని, 1962లో పనులు ప్రారంభమయ్యాయన్నారు. 126గ్రామాల నుంచి 23,216మంది వాటాదారులను కలిగి ఉన్నారు. ఈ కర్మాగారం 2005నుంచి కార్యకలాపాలను ఆపివేసిందని తెలిపారు. ఈ ఫ్యాక్టరీకి అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. ఫ్యాక్టరీని తెరిపిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

పసుపు రైతుల కలను నిజం చేశాం

- కిసాన్ సమ్మేళనం సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీజేపీకి అధికారం ఇవ్వండి : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- 40 ఏళ్ల కలను నిజం చేసిన ఘనత మోదీది: ఎంపీ అర్వింద్
- పసుపు చీరలతో కిసాన్ సమ్మేళనానికి వచ్చిన మహిళలు
- ఎన్‌సీసీ క్యాడెట్ల ప్లకార్డుల ప్రదర్శన

7

ఈటెలకు స్వాగతం పలికిన నాయకులు



ఈటెలకు ఘన స్వాగతం పలుకుతున్న ముదిరాజ్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూన్29(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పట్టణంలో ఆదివారం జరిగిన పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు యాసాడ నర్సింగ్ ముదిరాజ్ జిల్లా కేంద్రంలోని లహరి హోటల్ వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాబోయే తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఈటెల రాజేందర్ అని, రానున్న కాలంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దాదాపు 150 మంది ఈటెల రాజేందర్‌కు ఘనస్వాగతం పలికారు. ఘనస్వాగతం పలికిన వారిలో సంజీవ్‌రెడ్డి, మనోహర్, మద్దెల మురళి, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనీల్‌కుమార్, సుమన్, శీల శ్రీనివాస్, జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు.

జీపీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మోస్రా,జూన్29(ఆంధ్రజ్యోతి): జీపీ యూనియన్ నూతన మండల కమిటీని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్‌హకీం, ప్రధాన కార్యదర్శిగా వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంజనేయులు, కోశాధికారిగా రాము, ఉపాధ్యక్షుడిగా లింగం, సహాయ కార్యదర్శిగా నాగేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రావణ్ కుమార్, రాంబాబు, రమేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు రాజీలేని పోరాటం చేయాలని నన్నేసాబ్ సూచించారు.

బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ



బోధన్‌లో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

బోధన్‌రూరల్,జూన్29(ఆంధ్రజ్యోతి): ఆదివారం బోధన్ పట్టణంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను డప్పువాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. బోనాలతో మహిళలు మహలక్ష్మి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం నింపి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురియాలని, పాడిపంటలు సమృద్ధిగా కురియాలని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, మాజీ శివాలయం కమిటీ చైర్మన్ బీర్యాకర్ బుజ్జి, శ్రీను, శంకర్, భూమేష్, సురేందర్, సాయన్న, వీరేందర్, అజయ్, రాజు, శేఖర్, శ్యామ్, సింగం లక్ష్మణ్, రమేష్‌లతో మహిళలు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.ఆషాడ మాసం ఆదివారం సందర్భంగా భక్తులు తలపై బోనాలను ఎత్తుకుని స్థానిక నల్లపోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు.ఈ సందర్భంగా పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈకార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో ఆదివారం బోనాల పండుగను గ్రామ మాల కులస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మాల కులస్థుల ప్రతి ఇంటి నుండి బోనాలు తీసి భాజా భజంత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్ళి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాల కులస్థులతో పాటు గ్రామస్థులు తదితరలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

ఆర్మూర్ టౌన్, జూన్29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఎంఆర్ గార్డెన్‌లో ప్రజ్ఞ హైస్కూల్‌కు చెందిన 2007-08 బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి గురువులను పట్టు శాలువ, పూల మాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకుంటు ప్రస్తుతం చేస్తున్న పనులను ఒకరికొకరు తెలుపుకున్నారు.

మొరం వేసిన అధికారులు

- హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు



అంగన్‌వాడీ స్కూల్ వద్ద మొరం వేయిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్29(ఆంధ్రజ్యోతి): బురద రోడ్డు మొరం రోడ్డు అయింది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం ప్రచురితమైన రోడ్డంత బురద బురద కథనానికి ఎమ్మెల్యే, అధికారులు స్పందించారు. శనివారం బురద రోడ్డును పరిశీలించడమే కాకుండా ఆదివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆగమేఘాల మీదు అధికార యంత్రాంగం బురదగా ఉన్న రోడ్డును మొరం రోడ్డుగా మార్చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలు పాటించిన అధికారుల తీరును పలువురు ప్రశంసిస్తున్నారు. రోడ్డంత బురద బురద, గర్బిణీలు, బాలింతల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు బురదగా ఉన్న రోడ్డును మొరం రోడ్డుగా మార్చి వేయడంతో స్థానిక కాలనీవాసులు, అంగన్‌వాడీ చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీ స్త్రీలు, బాలింతలు, యూపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, ఉర్దూ మీడియం పాఠశాలలకు వెళ్లాలంటే బురదలో నడవాల్సి వస్తుండే వారని ఇక ఇబ్బందులు తొలగిపోయ్యాయని కాలనీవాసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బురదగా ఉన్న రోడ్డుపై మొరం రోడ్డు వేస్తూ ట్రాక్టర్ బ్లేడ్‌తో సాఫీగా చదును చేసి బురదగా ఉన్న రోడ్డును మొరం రోడ్డుగా మార్చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పలు చోట్ల గ్రామదేవతలకు జలాభిషేకం



డొంకేశ్వర్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు



కొత్తపల్లిలో వలగొడుగుతో..



సుంకెట్‌లో..



ఆలూర్‌లో..



పడిగెలలో ..

డొంకేశ్వర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతకు జలాభిషేకం నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గోదావరితీరం నుంచి పవిత్ర గంగాజలాన్నితెచ్చిడప్పు వాయిద్యాలు, వలగొడుగులతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని దేవుళ్లను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ క్యాషియర్ కల్లెం మహిపాల్, మేకల సుమన్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో ప్రజలు చల్లగా ఉండాలని గ్రామదేవతలను వేడుకుంటు గంగనీళ్లతో ఆదివారం గ్రామదేవతలకు అభిషేకం చేశారు.ముప్కాల్ మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, రెంజర్ల గ్రామాలలో గోదావరినుంచి గంగజాలలను తెచ్చి గ్రామ పొలిమేర నుంచి వలగొడుగుతో, డప్పువాయిద్యాలతో ద్యావతిమంత్రోచ్చరణల మధ్య మంగళహారతులతో గంగజలాలను ప్రధాన వీధుల గుండావెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకంచేసి,పసుపు,కుంకుమ, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని ప్రజలు సంఖసంతోషాలతో ఉండి వర్షాలు బాగా పండాలని మొక్కుకున్నారు.అనంతరం కుటుంబాలతో కలిసి వనభోజనాలు చేశారు.

మోర్తాడ్: మండలంలోని సుంకెట్‌గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని కులాల సభ్యులు వర్షాల కోసం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం నుండి గ్రామంలో ప్రజలు బోనాలు, వలగొడుగుతో ఊరేగింపుగా వెళ్త గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అన్ని దేవాలయాలలో పూజలు నిర్వహించారు. గంగపుత్రులు వలగొడుతో ఊరేగింపు నిర్వహిస్తు దేవాలయాలలోని విగ్ర హాలకు గంగనీటితో జలాభిషేకం చేశారు. వర్షాలు కురువాలని మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ మండలంలోని మిర్దాపల్లిలో ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గోదావరి నుంచి గంగజలాలను తీసుకువచ్చి గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో, ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభి షేకం నిర్వహించారు. గోదావరి తీరం నుంచి గంగజలాలు తీసుకువచ్చి వలగొడుగులతో, డప్పువాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా కురవాలని, ప్రజలందు ఆరోగ్యంగా సిరి సంపదలతో వర్ధిల్లాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భార్ల ముత్యం, నవనీత్, సునీల్, రాములు, మల్లేష్, కేశ్‌పల్లి గంగారెడ్డి, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్థానిక రామాలయం నుంచి గ్రామ దేవతలకు నైవేద్యాలతో ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవత లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు భాగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాప్రజలు సుఖసంతోషాలతో ఉండా లని పెద్దపోచమ్మ,ముత్యాలమ్మ,తాతాయి, ఐదుచేతుల పోచమ్మ దేవత లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్థులు వనబోజనాల కార్యక్రమం చేపట్టారు.

నేడు నవీపేటలో బోధన్ ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,జూన్29(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సోమవారం నవీపేటలో పర్యటించనున్నారని మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు భగవాన్‌లు తెలిపారు. ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హజరుకావాలని వారు కోరారు.

ఎడపల్లిలో యువకుడిపై కేసు నమోదు

ఎడపల్లి, జూన్29(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన షేక్‌ముజాహిద్ అనే యవకుడిపై పోక్సోకేసు నమోదు అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలిక రెండేళ్ల క్రితం ఎడపల్లిలో గల తన అమ్మమ్మ ఇంటికి తరచూ వచ్చేదన్నారు. అలా వచ్చిన సమయంలో గ్రామంలోని ఓ టైలర్ వద్ద బట్టలు కుట్టించడానికి వెళ్లిన సమయంలో అక్కడే ఉన్న టైలర్ మేనల్లుడు ముజాహిద్ బాలిక ఫోన్ నంబరు తీసుకుని పరిచయం ఏర్పరుచుకున్నాడన్నారు. అలా ఫోన్‌లో మాటలు కలిపి బాలికను శారీరకంగా వాడుకుని మోసం చేశాడని బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పొతంగల్‌లో మన్‌కీ బాత్ వీక్షణ



పొతంగల్‌లో ప్రధాని మన్‌కీ బాత్ వీక్షిస్తున్న నాయకులు

కోటగిరి,జూన్29(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని బీజేపీ నాయకులు సూదం అశోక్ ఇంట్లో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ 123వ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌ను వీక్షించారు. దేశ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ప్రధాని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మాండ్లు, మక్కయ్య, నాగం సాయిలు, శంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రమదానం



ఆలయ ఆవరణలో శ్రమదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్ రూరల్ , జూన్29 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లి వెంకటేశ్వర్ కాలనీలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఆలయ కమిటి అధ్యక్షుడు గడ్డం సంజీవరెడ్డి, శ్రావణ్, బోజన్న, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, గణేష్, నూకల ఆదిత్య, రాజ్‌కుమార్, రాజయ్య, నరేష్, మధుసుధన్, శ్యాంసుందర్, కృషి వర్ధన్, బాశెట్టి పెద్ద గంగారాం , ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

మురికి కూపంగా డీ50 ప్రధానకాలువ



ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ప్రధానకాలువ

- ప్లాస్టిక్, చెత్తచెదారంతో నిండిన వైనం
- వ్యర్థాలను తొలగించాలని రైతుల విన్నపం

నవీపేట,జూన్29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అలీసాగర్ డీ-50 ప్రధాన కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, ముళ్లపొదలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. పాత బస్టాండ్ సమీపం నుంచి బాసర రోడ్డు మూలమలుపు వరకు ప్రధాన కాలువ పరిస్థితి అధ్వానంగా మారింది. పలువురు హోటల్ నిర్వాహకులు ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వస్తువులను కాలువలో పడేస్తుండగా చికెన్ దుకాణదారులు చికెన్ వ్యర్థాలను సైతం కాలువలో పడేస్తున్నారు. కొందరు స్థానికులు తమ ఇళ్లలో ఉన్న పనికిరాని వస్తువులు, చెత్తచెదారంతో పాటు బీడీ ఆకులను సైతం కాలువలో పడేస్తున్నారు. దీనికి తోడు గతంలో గ్రామ పంచాయతీ పాలకులు డ్రైనేజీని సైతం ప్రధాన కాలువలో కలపడంతో పూర్తిగా దుర్గంధంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రధానకాలువ పూర్తిగా మురికికూపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అలీసాగర్‌ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల చేయకముందే కాలువ పూడికతీత చేపట్టి చెత్తచెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. కాలువ పూడికతీత పనులను వెంటనే చేపట్టి, చివరాయకట్టుకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



దుర్గంధంగా మారిన ప్రధాన కాలువ

ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రులకు వినతి



మంత్రి సీతక్కను నిధులు కేటాయించాలని కోరుతున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్ , జూన్29 (ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ పంచాయితీశాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఆదివారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డి విన్నవించారు.కేంద్రహోంశాఖా మంత్రి అమిత్ షా నిజామాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా జిల్లాకు వచ్చిన మంత్రులను వినయ్‌రెడ్డి కలిసి నియోజకవర్గ సమస్యలను విన్నవించి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం మంత్రులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి, భూపేందర్, రవికాంత్‌రెడ్డి, అనిల్ రావు, తదితరులున్నారు.

బోధన్‌రూరల్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను ఆదివారం బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తో పాటు పాషా మొయినోద్దీన్, శరత్ రెడ్డి, దాములతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ రాజకీయ అంశాలపై చర్చించామని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తెలిపారు.

కమ్మర్‌పల్లి: ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పంచాయితిరాజ్, గ్రామిణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీవివుసంక్షేమ శాఖల మంత్రి ధన్సరి సీతక్కను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్కను కలిసిన వారిలో ఆయనతో పాటు పలువురు కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



జిల్లా ఇన్‌చార్జిమంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతులలో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎడపల్లి,జూన్29(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 6,7,8 తరగతులలో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్,నిజామాబాద్ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ఎన్. గంగాశంకర్ అన్నారు. ఆదివారం ఓ ప్రకటనలో ఆయన తెలుపుతూ జిల్లాలో ఉన్న ఆయా గురుకల పాఠశాలల్లో జూలై 4వ తేదీన రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వ హించడం జరుగు తుందని అన్నారు. అర్హులైన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో నేటి నుంచి జూలై 2వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామ దేవతలకు పూజలు



గోదావరి నది గంగా జలాలను తీసుకువస్తున్న బుస్సాపూర్ గ్రామ ప్రజలు

మెండోర , జూన్29 (ఆంధ్రజ్యోతి): వానమ్మా.... వానమ్మా ఒక్కసారైనా వచ్చి పోవమ్మా అంటూ నిజామాబాద్ జిల్లా మెండోర, బుస్సాపూర్ గ్రామ ప్రజలు పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నది నుంచి కాలీ నడకన వెళ్లి డప్పు సప్పులతో వల గొడుగు, మంగళహారతులతో శివసత్తుల పునాకలు పోతరాజుల విన్యాసాలతో గంగ జలాలను తీసుకువచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో రైతన్నలు వ్యవసాయ భూముల్లో పసుపు, మొక్కజొన్న , సోయా పంటలు పెట్టినప్పటికీ నేటికి వర్షాలు కురియకపోవడంతో రైతన్నలు సోయా, మొక్కజొన్న ఉన్న ఒక్క పసుపు పంటను వరుణ దేవుడు కాపాడాలని గ్రామ దేవతలకు గోదావరి నదినుండి గంగ జలాలను తీసుకువచ్చి దేవతలకు జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీలో పలువురి చేరిక

ఆర్మూర్ టౌన్, జూన్29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలువురు ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరినట్లు నియోజకవర్గ ఇంచార్జి సయ్యద్ అవేజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన మహమ్మద్ ముఖ్తార్, కట్టడి కృష్ణ, సూఫీయాన్, సాయిలు పార్టీలో చేరగా నియోజకవర్గ ఇంచార్జి అవేజ్ వారికి పార్టీ కండువా వేసి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు అబ్దుల్ రహ్మాన్, మహ్మద్ రజాక్, అల్లాపూర్ గంగామణి, సాయితేజ, తదితరులు పాల్గొన్నారు.



ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి సునీల్‌రెడ్డికి లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్‌లు

వేల్పూర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని, నియోజకవర్గంలోని సొసైటీ చైర్మన్‌లను విమర్శించే అర్హత సునీల్‌రెడ్డికి లేదని నియోజకవర్గంలోని పీఏసీఎస్ చైర్మన్‌లు అన్నారు. ఆదివారం వేల్పూర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 20 సంవత్సరాల కాలంలో సొసైటీలు ఏ ప్రభుత్వం అధికారంలో ఉండగా నిధులు దుర్వినియోగం, అవకతవకలు జరిగాయే అధికారుల చేత విచారణ జరుపాలని సునీల్‌రెడ్డికి వారు సూచించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గత మూడు, నాలుగు సంవత్సరాల నుంచి ఐసీడీఎంఎస్ ద్వారా తగినంత యూరియా సొసైటీలకు ఇప్పించిన ఘనత ప్రశాంత్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్, రామన్నపేట్, పడిగెల్, మోతె సొసైటీ చైర్మన్‌లు రేగుంట దేవేందర్, బద్దం అశోక్, జే. మోహన్‌రెడ్డి, యాల్ల హన్మంతు, మోతే రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, ప్రతాప్‌రెడ్డి, డొల్ల రాజేశ్వర్, రమేష్, శేఖర్, సుభాష్, రాము, అశోక్, తదితరులున్నారు.


అభివాదం చేస్తున్న హోంమంత్రి అమిత్‌షా


హోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ అర్వింద్


సభకు వచ్చిన జన సందోహం



అభిమానం చాటుకుంటున్న బాలుడు

పసుపు రైతుల కలను నిజం చేశాం

- కిసాన్ సమ్మేళనం సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇవ్వండి: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- బండి సంజయ్ స్పీచ్‌తో కార్యకర్తల్లో ఉత్సాహం
- 40 ఏళ్ల కలను నిజం చేసిన ఘనత ప్రధాని మోదీది: ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పసుపు రైతుల కలను నిజం చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని కేంద్ర బొగ్గు గణుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కిసాన్ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పసుపు సాగవుతున్నా తెలంగాణపై ప్రేమతో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు నిజామాబాద్‌లో పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. కేంద్రం లోని మోదీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఈ ప్రాంత రైతులకు కేంద్రం అండగా ఉంటుందన్నారు. రైతులకు ఎరువులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటుందని ఇందు కోసం కేంద్రం రామగుండంలో ఎరువుల ఫ్యాక్టరీని ప్రారంభించిందన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్న ఘనత కేంద్రానిది అని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ రాష్ట్రానికి చేస్తున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని అన్నారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పసుపు బోర్డు ఎందుకు తీసుకురాలేదో జవాబు చెప్పాలన్నారు. సంవత్సరానికి రైతులకు సహాయంగా పీఎం కిసాన్ యోజన కింద 6వేలు అందిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిది అన్నారు. తెలంగాణ రైతాంగానికి కేంద్రం అండగా ఉంటుందని పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ, అమిత్‌షాలకు తెలంగాణ రైతాంగం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

అందరికీ అవకాశం ఇచ్చారు..
బీజేపీకి ఇవ్వండి అధికారం..

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

తెలంగాణ ప్రజలు అందరికీ అవకాశం ఇచ్చారని ఈ సారి బీజేపీకి అధికారం ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రజలు గొప్ప వాళ్లని ఎన్నో ఏళ్లుగా కొట్లాడుతున్న పసుపు బోర్డును ఢిల్లీలో కొట్లాడి మరీ సాధించారని అన్నారు. ఇందూరు రైతులు హీరోలు అని పసుపు రైతులు చేసిన ఉద్యమం మామూలు ఉద్యమం కాదన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురిని అందరూ పసుపు అర్వింద్ అంటున్నారని ఆయన అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతును రాజును చేయాలనేది గత నినాదం అని కానీ రైతును రారాజు మహారాజును చేయాలనేది మోదీ ప్రభుత్వ నినాదం అన్నారు.

40 ఏళ్ల కలను నిజం చేసిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు: ఎంపీ అర్వింద్ ధర్మపురి

నిజామాబాద్ ప్రాంత ప్రజలు పసుపు బోర్డు కోసం 40 ఏళ్లుగా కన్న కలలను నిజం చేసిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలకు ఎంపీ అర్వింద్ ధర్మపురి ధన్యవాదాలు తెలిపారు. తాను పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కార్యక్రమం ద్వారానే బీజేపీలో చేరానని ఇప్పుడు పసుపు బోర్డు సభ ఇదే వేదికపై జరగడం తన అదృష్టం అన్నారు. ఇక్కడి రైతుల పరిస్థితిని చూసే ఎన్నికల్లో హామీ ఇచ్చాము. రైతులు మద్దతు ఇచ్చారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నెరవేర్చారు. రైతులకు అండగా నిలబడ్డారు. పసుపు బోర్డు ఇచ్చి నిజామాబాద్ రైతులకు మేలు చేశారు. ఈ బోర్డు ద్వారా ఇక్కడి రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన అన్నారు.

ధన్యవాదాలు తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి కేంద్ర పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి ధన్యవాదాలు తెలిపారు. పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన సభలో దినేష్‌కులాచారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఉదయం నుంచి ఆయన సభను అన్ని తానై నడిపించారు.


సభకు తరలివస్తున్న పసుపు రైతులు

డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా


డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా


ఆవిష్కరణ తర్వాత అభివాదం చేస్తూ..

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం ఆవిష్కరించారు. జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించేందుకు నగరానికి వచ్చిన ఆయన కంఠేశ్వర్‌లోని బైపాస్ చౌరస్తాలో డీఎస్ తనయుడు, ఎంపీ ధర్మపురి అర్వింద్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన డీఎస్ విగ్రహాన్ని హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీఎస్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని 44 లక్షల వ్యయంతో 14 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆయన తనయుడు అర్వింద్ ఏర్పాటు చేశాడు. అనంతరం జరిగిన కిసాన్ సమ్మేళనంలో సైతం అమిత్‌షా తన ప్రసంగంలో డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, డీఎస్ సోదరులు ధర్మపురి సురేందర్, ధర్మపురి ప్రకాశ్ పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి పర్యటన సైడ్‌లైట్స్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటన ఆదివారం నగరంలో ఆద్యంతం ఆసక్తిగా జరిగింది.

- మధ్యాహ్నం 2.15 నిమిషాలకు జిల్లా కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెలిక్యాప్టర్ లాండ్ అయ్యింది.
- కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ అర్వింద్, కలెక్టర్, సీపీలు ఆయనకు స్వాగతం పలికారు.
- 2.25 నిమిషాలకు వినాయక్‌నగర్‌లో కేంద్ర పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్‌షా ప్రారంభించారు.
- 2.35నిమిషాలకు బస్వాగార్డెన్‌కు వచ్చారు.
- 3.15 నిమిషాలకు బస్వాగార్డెన్ నుంచి కంఠేశ్వర్ బయలుదేరారు.
- 3.25 నిమిషాలకు బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్ర హాన్ని ఆవిష్కరించారు.
- 3.35 నిమిషాలకు పాలిటెక్నిక్‌లో బహిరంగ సభ వేదికపైకి వచ్చారు.
- 3.50 నిమిషాలకు ప్రసంగాన్ని ప్రారంభించారు.
- 4.08 నిమిషాలకు ప్రసంగం ముగించారు.
- 4.20 నిమిషాలకు నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు.
- పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన కిసాన్ సమ్మేళనానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పసుపు రంగు చీరలతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కొంత మంది మహిళలు బోనాలతో నృత్యాలు చేస్తూ హాజరయ్యారు.
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రసంగం ప్రారంభించేటప్పుడు కార్యకర్తలు సందడి చేశారు. కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించడంతో హోంమంత్రి అమిత్‌షా సైతం ఆసక్తిగా ప్రసంగాన్ని విన్నారు.
- జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రి అమిత్‌షాను ఎంపీ అర్వింద్ ధర్మపురి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిలు ఘనంగా సన్మానించారు.
- కేంద్ర హోం మంత్రి పర్యటన సందర్భంగా పోలీసు బందోబస్తును పోలీస్ కమీషనర్ సాయిచైతన్య, కామారెడ్డి అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డిలు పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కిసాన్ సమ్మేళనంలో దగ్గరుండి పర్యవేక్షించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల నిరసన...

పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కిసాన్ సమ్మేళనం కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. అమిత్‌షా ప్రసంగిస్తున్న సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులను ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. ఎంబీబీఎస్‌లో ఒక్క శాతం ఎన్‌సీసీ కోటా రిజర్వేషన్‌ను గతంలో తీసేశారని తిరిగి రిజర్వేషన్ కల్పించాలంటూ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులను ప్రదర్శించారు. పోలీసులు వారిని బయటకు పంపారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఇద్దరు వరంగల్ నుంచి వచ్చినట్లు తెలిసింది.

మినీ ట్యాంక్ బండ్
సుందరీకరణ పనుల్లో నాణ్యతా లోపం

- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


పనులను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు (ఫైల్)


ఇనుప రెయిలింగ్‌కు జాయింటింగ్ చేసిన దృశ్యం

ఆర్మూర్ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద చేపడుతున్న మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గూండ్ల చెరువు మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ చేపట్టడానికి పంచాయతీ రాజ్ నుండి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.4 కోట్లు కేటాయించగా ఎక్సైజ్, పర్యాటకం, సాంస్కృతిక పురావస్తు అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏప్రిల్ 16న శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. పంచాయతీ రాజ్ అధికారులు ఏ ఒక్కరోజు వచ్చి పరిశీలించక పోతున్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు అప్పడప్పుడు వెళ్లి పనులను పరిశీలిస్తున్నామని చెప్తున్నారే తప్ప నాణ్యత విషయంలో కానీ, పనులు జరుగుతున్న తీరుని పరిశీలించడం లేదనేది సత్యం, కొద్ది రోజులుగా జరుగుతున్న పనుల్లో ఇసుక, డస్ట్, మట్టితో కలిపి సిమెంట్ పనులను చేపడుతున్నారు. తద్వారా కొద్ది నెలలకే చేసిన పనుల్లో పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. ఇదియేగాక గూండ్ల చెరువు కట్టపై ఇనుప రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. కానీ సిమెంట్‌కు ఏర్పాటు చేసిన రంధ్రాల్లో రెయిలింగ్ రాకపోవడంతో అడుగు భాగంలో జాయింటింగ్ ఇచ్చారు. ఆ రెయిలింగ్‌కు అడుగు భాగంలో సిమెంట్‌తో మూసి వేస్తారు. గణపతుల నిమజ్జన సమయంలో విపరీతంగా ప్రజలు నిమజ్జనానికి వీక్షించడానికి గూండ్ల చెరువుకు వస్తారు. రైలింగ్ అడుగు భాగంలో జాయింటింగ్ వీడిపోయే ప్రమాదం ఉంది. దాంతో ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది.

అధికారుల పనితీరుపై ప్రజల ఆగ్రహం

జరుగుతున్న అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తే పనులను పరిశీలించవల్సిన అధికారులు ఆమ్యామ్యాలు అందుతే చాలు అన్నట్లు ప్రవర్తించడం సరి కాదని, ప్రతీరోజు పనులను పరిశీలించాలని అంటున్నారు. అధికారులు, కాంట్రాక్టర్‌లతో కుమ్మకైతే ప్రజలకు భారీ నష్టం వాటిల్లుతుందని విధులు నిర్వహిస్తున్నా అధికారులు సక్రమంగా నిర్వహించాలని ఆమ్యామ్యాలకు ఆశ పడొద్దని వేడుకుంటున్నారు.

వన మహోత్సవానికి అంతా సిద్ధం

- నాగిరెడ్డిపేట మండలంలోని 25 నర్సరీల్లో లక్ష మొక్కలు నాటేందుకు సిద్ధం
- 83 వేల మొక్కలు నాటే లక్ష్యం


ధర్మారెడ్డిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకర్ చారి


గోపాల్‌పేట్‌లో నర్సరీని పరిశీలిస్తూ..

నాగిరెడ్డిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో మండలంలోని గ్రామ గ్రామాన మొక్కలు నాటేందుకు వన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. గ్రామపంచాయతీలవారిగా ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలను పెంచి ప్రస్తుతం మొక్కలు నాటేందుకు వాటిని సిద్ధంగా ఉంచారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరిత హారం ద్వారా మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టగా, ప్రస్తుతం మన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ వన మహోత్సవంలో భాగంగా వివిధ రకాల నీడ నిచ్చే మొక్కలతోపాటు, పూల మొక్కలు, పండ్ల మొక్కలు వివిధ నర్సరీలలో పెంచి నాటేందుకు అధికారులు సిద్ధం చేశారు. నాగిరెడ్డిపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి ఒక్కో గ్రామపంచాయతీ నర్సరీలో నాలుగు వేల చొప్పున మొక్కలను పెంచారు. ప్రస్తుతం మండలంలోని నర్సరీ లలో ఒక లక్ష మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. ఈ సారి వన మహోత్సవంలో భాగంగా మండలంలో 83 వేల మొక్కలు నాటే లక్ష్యంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని రెండు కొత్త గ్రామ పంచాయితీలతో కలుపుకుని 27 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో గ్రామ పంచాయితీ పరిధిలో 2,300 మొక్కల చొప్పున మండలంలో 62,100 మొక్కలు నాటనున్నారు. అలాగే ప్రతీ గ్రా మాల్లో 23 వేల మొక్కలను పంపిణీ చేసి వాటిని అధికారులు నాటించ నున్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు

మండలంలో వన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మండల అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. నర్సరీలలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండటంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలు, గ్రామీణ రోడ్ల ప్రక్కన ఖాళీ స్థలాలను ఎంపిక చేసి మొక్కలు నాటనున్నారు. ఎంపిక చేసిన స్థలాల్లో మొక్కలు నాటించడంతో పాటు వాటిని సంరక్షించేలా అవసరమైన ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. నాటిన ప్రతి మొక్క బ్రతికిలా తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు.

గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడు..!?


రామారెడ్డి గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు మధ్యలో నిలిచిపోవడంతో అదనపు రోడ్డు ఏర్పాటు చేసిన రోడ్డుపై లారీ బోల్తా పడిన దృశ్యం (ఫైల్)


రోడ్డుపై పెద్ద వాహనాలను తీసుకువెళుతున్న దృశ్యం


మధ్యలో నిలిచిపోయిన గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు

- రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

రామారెడ్డి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తికానందున రాకపోగలరని మండల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కామారెడ్డి జిల్లా కేంద్రానికి బ్రిడ్జి వారధిగా ఉన్నందున 20 గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జిపై నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రావడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రైతులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున వర్షాకాలంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, వేంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తిగా చేపట్టి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోని వెంటనే స్పందించి బ్రిడ్జి పనులను పూర్తి చేయించాలని కోరారు. ఈ రహదారి గుండా శ్రీ బుగ్గ రామ లింగేశ్వర స్వామి, శ్రీ కాలభైరవ స్వామి ఆలయాలకు వేల మంది భక్తులు వస్తారని, ప్రజలను రైతులను దృష్టిలో పెట్టుకొని పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం భీంగల్, ధర్పల్లి, సిరికొండ, డిచ్‌పల్లి, తదితర మండలాల ప్రజలకు ఈ బ్రిడ్జి గుండా హైదరాబాద్‌కు వెళ్తారని ప్రజలు ఆరోపిస్తున్నారు. డీఏవో సంతోషి అధికారి లేకపోవడంతో ఈఈ ఆదేశాల మేరకు ఇంకో అధికారికి వినతి అందజేశారు. గత ప్రభుత్వం మూడు కోట్ల 4 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించారు. మొదటి నుంచి ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో విధులు నిర్వహించి మధ్యలో కాంట్రాక్టర్ నిరసన వ్యక్తం చేస్తూనే నిరసిస్తూ ఒక్కసారిగా వదిలివెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టి బ్రిడ్జి పనులను వెంటనే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా బంజార సేవా నూతన కార్యవర్గం



సుదర్శన్ రెడ్డిని కలిసిన జిల్లా బంజార సేవాసంఘ్ నూతన కార్యవర్గం సభ్యులు

మోపాల్,జూన్ 29 (ఆంధ్రజ్యోతి):బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆదివారం సాయంత్రం బోర్గాం (పి) గ్రామంలో ఆలిండియా బంజార సేవా సంఘ్ జిల్లా నూతన అధ్యక్షుడు బాబురావ్, జనరల్ సెక్రెటరి కె. గంగాధర్, కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ, బంజార సేవా సంఘం రాష్ట్ర నాయకులు కెతావత్ యాదగిరి ఆధ్వర్యంలో కలిసారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బంజారులందరు ఐకమత్యంతో ఉండాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గిరిజనులందరికి తెలియజేయాలని కోరారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి సుదర్శన్ రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం సుదర్శన్ రెడ్డిని జిల్లా బంజార సేవా సంఘ్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కార్యవర్గ సభ్యులు సన్మానించారు. సుదర్శన్ రెడ్డి వెంట వక్ఫ్‌బోర్డు చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, నగేష్ రెడ్డి, రత్నాకర్, మోహన్, తదితరులు ఉన్నారు.

డీవీకే సంస్మరణ సభకు తరలి వెళ్లిన మాస్‌లైన్ నాయకులు



హైదరాబాద్ తరలిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

సిరికొండ జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన డీవీ కృష్ణారెడ్డి సంస్మరణ సభకు సిరికొండ ప్రాంతం నుంచి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు తరలివెళ్లారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి అమరుడైన డీ.వీ.కృష్ణారెడ్డి 3వ వర్ధంతి సభకు నిజామాబాద్ రూరల్- కామారెడ్డి సంయుక్త జిల్లాల కార్యదర్శి ప్రభాకర్ , సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ,భీమ్‌గల్, సిరికొండ మండలాలకు చెందిన నాయకులు రమేష్,దామోదర్‌తో పాటు పీవోడబ్ల్యూ రాష్ట్రఉపా ధ్యక్షురాలు గోదావరి,సత్తెక్క తదితరులు హైదరాబాద్ సమావేశానికి వెళ్లారు. ప్రభాకర్ మాట్లాడుతూ డీవీ కృష్ణారెడ్డి ఉద్యోగం వదిలి పెట్టి తన జీవితాంతం విప్లవోద్యమానికి అంకితం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. సిరికొండ,సిరిసిల్లా ఉద్యమాలకు డీవీకె గుండెకాయల పనిచేశాడని ఆయన సేవలను ప్రభాకర్ కొనియాడారు.బలమైన ఉద్యమాలను నిర్మించిన ఆణిముత్యం లాంటి కమ్యూనిస్టు నాయకుడన్నారు.

సహారా గ్రూప్ బాధితుల నిరసన



హాల్ ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్,జూన్ 29(ఆంధ్రజ్యోతి): సహారా గ్రూప్‌కు చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లించేలా చేయాలని సహార బాధితులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర కో ఆపరేటివ్ శాఖ మంత్రి అమిత్ షా బాధితులకు న్యాయం చేయాలని పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశం హాలు ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షాని కలిసి తమ గోడును చెప్పుకుందామని చూసినా సెక్యూరిటీ అనుమతించకపోవడంతో నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. 2023 సంవత్సరంలో సహర గ్రూప్‌ను బ్యాన్ చేసినా ఇప్పటికి నడిపిస్తున్నారన్నారు.సుమారు 150మంది బాధితులు అమిత్ షా పర్యటన అనంతరం నిరసన వ్యక్తం చేశారు.

సిర్పూర్‌లో ముత్యాలమ్మ పండుగ



సిర్పూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

మోపాల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతీసంవత్సరం వీడీసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందన్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలతో పాటు ఆయాపార్టీల ప్రజా ప్రతినిధులు, మహిళలులో పాల్గొన్నారు.

బాలుడిని ఢీకొన్న ఇన్నోవా వాహనం

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుమీద ఆడుకుంటున్న ఏడేళ్ల బాలుడిని ఇన్నోవా వాహనం వేగంగా వచ్చి ఢీకొన్న ఘటన ఆదివారం నగరంలోని ముజాయిద్‌నగర్‌లో జరిగింది. ఈఘటనలో ఆయుబ్ (07) ఘటన స్థలంలోనే మృతి చెందాడు. తన ఇంటి ముందు ఆడుకుంటున్న ఆయూబ్‌ను చూసుకోకుండా ఇన్నోవా వాహనం అతనిపై నుంచి పోవడంతో ఘటన స్థలంలోనే ఆయూబ్ మృతి చెందినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై ఆయుబ్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది.

సౌదీలో మృతి చెందిన జిల్లా వాసి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం సౌది అరేబియాకు వెళ్లి నిద్రలోనే మృతి చెందిన వేల్పూర్ మండలం పచ్చనడ్కుడకు చెందిన గోజకిషన్ (61) మృతదేహాన్ని తెప్పించేందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి చొరవ చూపారు. ఈ మేరకు కిషన్ మృతదేహాన్ని త్వరగా తీసుకువచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ భీమ్‌రెడ్డి సమన్వయంతో సీఎం కార్యాలయం తక్షణమే స్పందించి మృతదేహాన్ని తీసుకొచ్చే ప్రక్రియను వేగవంతం చేశారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తిపలకాలి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని వాటిని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు.జాతీయ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఒక్కరోజు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చక్రపాణి, కార్యదర్శి హన్మాండ్లు, నాయకులు బానుచందర్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు



అమిత్‌షా సభకు తరలుతున్న బోధన్ బీజేపీ నాయకులు



అమిత్ షా సభకు బయలుదేరుతున్న రైతులు, నాయకులు

ధర్పల్లి,జూన్ 29 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్‌లో జరిగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు ధర్పల్లి మండలం నుంచి ఆదివారం భారీగా బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వస్తున్న అమిత్‌షా సభను విజయ వంతం చేసేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వాహనాలు ఏర్పాటు చేశామని 2వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, బీజేవైఎం అధ్యక్షుడు రాజశేఖర్, కర్క గంగారెడ్డి, దాసు, మహేష్, రాము, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: జాతీయ పసుసు బోర్డు కార్యలయ ప్రారంబో త్సవానికి సిరికొండ మండలం నుండి బిజెపి కార్యకర్తలు,నాయకులు తరలి వెళ్లారు. ఆదివారం నిజామాబాద్‌లో జాతీయ పసుసు బోర్డు కార్యలయం ప్రారంబోత్సవానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరైన సమావేశానికి మండలానికి చెందిన రాష్ట్ర, జిల్లా నాయకులు నాయకులు రామస్వామి,రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, అధ్యక్షకార్య దర్శు లు సంజీవ్‌రెడ్డి, బాబురావు, మహేందర్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కార్యవర్గాల నాయకులు బస్సుల్లో తరలివెళ్లారు.

ఆర్మూర్‌టౌన్:జిల్లా కేంద్రంలోని పసుపుబోర్డు ప్రారంభానికి విచ్చేసిన అమిత్ షాసభకు మున్సిపల్ పరిధిలోని రైతులు,బీజేపీ నాయకులు భారీ ఎత్తున బయలుదేరారు.రైతుల ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితం ఎంపీ పసుపు బోర్డును తీసుకువచ్చి రైతుల కాం క్షను నెరవేర్చారని కృతజ్ఞతగా రైతులుసభకు బయలుదేరినట్లు తెలి పారు.

బోధన్‌రూరల్: నిజామాబాద్‌లో నిర్వహించిన రైతు మహ సమ్మేళనం కార్యక్రమానికి బోధన్ నుండి బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కేంద్రమంత్రి అమిత్‌షా పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమానికి బోధన్ నుండి పది బస్సుల్లో, కార్లు, ద్విచక్ర వాహనాల్లో భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నామని బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎంపీ ధర్మపురి అరవింద్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు తెచ్చి రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట:జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రైతు సమ్మేళనం సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈమేరకు ప్రత్యేక వాహనాలలో వారు తరలివెళ్లారు. అమిత్‌షా ప్రసంగాన్ని నాయకులు తిలకించారు.



పొతంగల్‌లో ..

రుద్రూరు: నిజామాబాద్ జిల్లాలో జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయ ప్రారంభోత్సవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విచ్చేసిన సందర్భంగా ఆదివారం రుద్రూరు మండలంలోని అంబం, అక్బర్‌నగర్, రుద్రూరు, రాణంపల్లి, రాయకూర్, చిక్కడ్‌పల్లి, సులేమాన్ నగర్‌తో పాటు పలు గ్రామాల నుండి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు కటికె రామ్ రాజ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

కోటగిరి: జిల్లా కేంద్రంలో కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పొతంగల్, కోటగిరి మండల కేంద్రాల్లో ఆదివారం కేంద్ర హోంమంత్రి పర్యటనలో పాల్గొనేందుకు బస్సులు, ప్రత్యేక వాహనాల్లో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన పసుపు బోర్డును ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మాండ్లు, ప్రకాష్ పటేల్, శేఖర్, ఓమన్న పటేల్, నాగం సాయిలు, మక్కయ్య, గజు పటేల్, గిరిధర్, గోవింద్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్టు చేయడం సరికాదు



పోలీసులు అదుపులోకి తీసుకున్న ప్రజా సంఘాల నాయకులు

బోధన్‌రూరల్,జూన్29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసి నియంత పాలన సాగిస్తుందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం కేంద్ర మంత్రి జిల్లాకు పసుపు బోర్డు ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా ముందస్తుగా ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. పసుపు బోర్డు ఎవరి దయాదక్షిణాల మీద వచ్చింది కాదని రైతాంగ పోరాటాల ఫలితంగా పసుపు బోర్డును సాధించడం జరిగిందని పసుపు బోర్డు ప్రారంభానికి వస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రివర్యులు పర్యటనకు మమ్మిల్ని ముందస్తుగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మల్లేష్, శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, గౌతం కుమార్, జునేద్, మంగేష్, రాజు, సాయి కుమార్‌లతో ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులున్నారు.

మోపాల్:కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జిల్లా పర్యటనలో భాగంగా ముందస్తుగా కమ్యూనిస్టు పార్టీ నాయకులను ఆదివారం ఉదయం మోపాల్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకులు సాయగౌడ్,వేల్పూర్ భూమయ్య, కంజరభూమయ్యలు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ అరెస్టులు చేయడంపై సాయగౌడ్, భూమయ్యలు మండిపడ్డారు. అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మాక్లూర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నిజామాబాద్ పర్యటన సందర్భంగా ఆదివారం సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్‌లను అరెస్టు చేశారు. ప్రజా సమస్యల పోరాటానికి పాటుపడుతున్న తమను అరెస్టు చేయడం అక్రమమని వారన్నారు. ప్రజా వ్యతిరేక విదానాలు విడనాడి వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆర్మూర్‌టౌన్: పసుపు బోర్డు ప్రారంభానికి కేంద్రమంత్రి అమిత్ షా రావడంతో సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ సబ్ డివిజన్ కార్యదర్శి డి. కిషన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవనంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐఎంఎల్ మాస్ లైన్ రైతు జేఏసీ నాయకులతో పాటు రైతులు పార్టీలకు అతీతంగా దశాబ్దాలుగా పసుపు బోర్డు కోసం పోరాటం చేయడంతో పసుపు ఏర్పాటు సాధ్యమైందని అనేక ఉద్యమాలు, పాదయాత్రలు, నిసనలు, అక్రమ కేసులు, అరెస్టులు, జైలు నిర్బంధాలు అన్ని ఎదుర్కొని నిలబడ్డ నాయకులు వారి పోరాట ఫలితంగానే పసుపు బోర్డు ఏర్పాటైందని పసుపు బోర్డు ప్రారంభానికి అమిత్ షా రావడంతో బీజేపీ నాయకులు ప్రశ్నించే వారిని ముందస్తు అరెస్టు చేయించడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. బీజేపీ అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలు చేస్తున్నప్పుడు ఎందుకు భయపడాల్సి వస్తుందని ప్రజల హక్కులను కాలరాస్తున్న బీజేపీ నాయకులు రైతులకు , రైతు నాయకులకు క్షమాపనలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్ నాయకులు మచ్చర్ల రాజన్న, దుర్గప్రసాద్, కార్మిక నాయకులు అరవింద్ రవి, బట్టు రవి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంబోత్సవానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వస్తున్న సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందినసీపీఎంఎల్ మాస్‌లైన రాష్ట్ర,జిల్లా,మండల నాయకులను స్థానిక పోలీసులు ఆదివారం ఉదయం ముందస్తు అరెస్టులు చేశారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

నవీపేట: నిజామాబాద్‌లో ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటనను పురస్కరించుకుని పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శనివారం రాత్రి వారిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం ముందస్తుగా అరెస్టు చేసిన నాయకులను విడుదల చేశారు. ముందస్తుగా అరెస్టు అయిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, పెద్ది వెంకట్రాములు, మాస్‌లైన్ టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, అనిల్, మల్లేష్, కమల్, గణేష్,సింగ్, తదితరులున్నారు.

సిరికొండ:నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యలయం ప్రారం భోత్సవానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వస్తువన్నారని ఏమైన ఆందోళ నలు చేస్తారని దృష్టిలో పెట్టుకుని పోలీస్‌లు సీపీఐఎంఎల్ మాస్‌లైన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులను అరెస్టు చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. రాత్రనగ,పగనలక పోలీసులు ఇళల్లోకి వచ్చి అరెస్టులు చేయడమేమిటని మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.సిరికొండ ఎస్సై రామ్ రామకృష్ణను, రమేష్‌ను అరెస్టు చేశారు.

నిజామాబాద్ కల్చరల్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా జిల్లా పర్యటన పురస్కరించుకొని పలు సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌లను రూరల్ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి నవీపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

వెల్నెస్ అడ్వాన్స్‌డ్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య విధానంతో వెల్నెస్ ఆసుపత్రి తన ఏడవ బ్రాంచ్‌ను ఆదివారం నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడిలో ప్రారంభించింది.మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆసు పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు దీటుగా కార్పొరేట్ ఆసు పత్రులకు ఏమాత్రం తీసిపోకుండా వెల్నెస్ ఆసుపత్రి నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం అభినంద నీయ మన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో నిజామా బాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం సుమన్‌గౌడ్, వివేకానందరెడ్డి, అసద్ ఖాన్, నిజామాబాద్ వైస్ ప్రసిడెంట్ బోదుఅశోక్‌కుమార్‌లు మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలు తమ ఆసుప త్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్డియా లజీ, న్యూరాలజీ, గైనకాలజీ, ఈఎన్‌టీ, పల్మనాలజీ, క్రిటికల్ కేర్‌కు సంబంధించిన అన్ని వైద్యసేవలు తక్కువ ధరలతో కార్పొరేట్ వైద్యం నిజామాబాద్‌లో అందిం చాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ ప్రారంభించడం జరిగింద న్నారు. ఈ ప్రారంభోత్సవంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, నుడా చైర్మన్ కేశవేణు, మానాల మోహన్‌రెడ్డి, వినయ్ రెడ్డి, అంతరెడ్డి రాజారెడ్డి, నగరానికి చెందిన వైద్యులు పాల్గొన్నారు.



వెల్నెస్ ఆసుపత్రిలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

2030 నాటికి మిలియన్ డాలర్ల పసుపు ఎగుమతి!

(ఐదో పేజీ తరువాయి)

ముందుకు తీసుకెళ్లామన్నారు. పసుపు బోర్డును అనేక పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వడం,అంతేగాకుండా ఇందూరు జిల్లాకు పసుపుబోర్డు ఇవ్వడం దేశానికి గర్వకారణమన్నారు. ఎంపీధర్మపురి అర్వింద్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ కోసం తరచూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పీఎం మోదీ, అమిత్‌షాల ద్వారా పసుపు బోర్డు ఏర్పాటు చేసాడన్నారు. పసుపు బోర్డు ఏర్పాటులో కీలక పాత్రపోషించిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

● సామాన్య రైతును చైర్మన్‌ను చేసింది

:పల్లె గంగారెడ్డి, జాతీయ పసుపుబోర్డు చైర్మన్

దశాబ్దాల కలను కేంద్ర ప్రభుత్వం, మోడీ, అమిత్ షాలు నెరవేర్చారు. రైతు ఉన్నతి కోసం పసుపు బోర్డు పనిచేస్తుంది. 2030వరకు 5వేల కోట్లకు ప్రపంచ దేశాలకు ఎక్స్‌పోర్ట్ అయ్యేలా కృషిచేస్తాం. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తనను పసుపు బోర్డు చైర్మన్‌ను చేసిన ప్రధాని మోడీకి, అమిత్‌షాకు, ఎంపీ అర్వింద్‌కు, బీజేపీకి కృతజ్ఞతలు తెలిపారు..

● ప్రారంభోత్సవ సమావేశంలో భారీగా హాజరైన రైతులు

పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశంలో రైతులు భారీగా హాజరయ్యారు. సుమారు 500మందికి పైగా పసుపు రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశ నిర్వాహకులు రైతులకు ముందుగానే గుర్తింపు కార్డులు అందజేశారు. గుర్తింపు ఉన్నవారికే అమనుతించారు. వివిధ మండలాల నుంచి పసుపు రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమిత్ షా సమావేశ మందిరానికి రాగానే కరతాళధ్వనులతో స్వాగతం పలికారు. జై కిసాన్... జై జవాన్ అంటూ నినదించారు. దీంతో అమిత్ షా రైతులకు అబివాదం చేశారు.

● పసుపు రైతులతో ఫొటో దిగిన కేంద్ర అమిత్ షా

పసుపు పండిస్తున్న రైతులతో కలిసి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఫోటో దిగారు. పసుపు పండిస్తున్న తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. అమిత్ షా రైతులను పిలిచి ఫొటో దిగడంతో రైతులు సంబరపడిపోయారు. కొందరు పక్కనే కూర్చొని సెల్ఫీలు దిగారు.

పసుపు బోర్డు వల్ల ఉపయోగం లేదు

● పసుపుకు మద్దతు ధర కల్పిస్తేనే రైతులకు మేలు

● ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పసుపు బోర్డు వల్ల ఉపయోగం లేదని మద్దతు ధర కల్పించినప్పుడే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తాత్కాలిక కార్యాలయాన్ని నిజామాబాద్‌లో ప్రారంభించడం వల్ల ఉపయోగం లేదన్నారు. బోర్డును ఏర్పాటు చేయడమే కాకుండా ధర కల్పించినప్పుడే ఉపయోగం ఉంటుందన్నారు. పసుపు బోర్డుకు నిధుల కేటాయింపు చేయడంతో పాటు శాశ్వత భవనాల విషయంలో హోంమంత్రి స్పష్టతను ఇవ్వలేదన్నారు. పసుపు బోర్డు కోసం నిజామాబాద్ రైతులు నాలుగు దశాబ్దాల పాటు పోరాటం చేశారని అన్నారు. మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డితో పాటు కోటపాటి నర్సింహనాయుడు ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. ఎంపీగా కవిత ఉన్న సమయంలో ఎమ్మెల్యేలందరం కలిసి కేంద్రానికి విన్నవించిన సహకరించలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు 2019 సమయంలో ఎంపీ అర్వింద్ బాండ్ పేపర్ రాసిచ్చారని అన్నారు. నిజామాబాద్‌లో 2022లో పసుపు బోర్డు బదులు సుగంద ద్రవ్యాల బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తే రైతులు వ్యతిరేకించారని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమ యంలో బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ మహబూబ్‌నగర్‌లో ప్రకటించారని అన్నారు. చివరకు జనవరి 14న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పసుపు బోర్డును ప్రారంభించారని అన్నారు. బీజేపీ నాయకులు పల్లెగంగారెడ్డిని చైర్మన్‌గా నియమించారని అన్నారు. బోర్డు ఏర్పాటు తర్వాత పసుపు ధర 8వేల నుంచి 10వేల మధ్యనే క్వింటాలుకు ధర పలికిందన్నారు. బోర్డుపై బిల్లు పెట్టిన రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డిని పిలువలేద న్నారు. నామమాత్రంగా కార్డు ను పంపించారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోనే ఈబోర్డును ప్రారంభించారని ఆయన అన్నారు. బోర్డులన్నీ పార్లమెంట్‌లో చట్టం చేసి ఏర్పాటు చేస్తే పసుపు బోర్డు మాత్రం వాణిజ్య పరిశ్రమల శాఖ ఉత్తర్వుల ద్వారా ఏర్పాటు చేశారన్నారు. పసుపు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తేనే లాభం జరుగుతుందని ఆయన తెలిపారు.ఎన్నికల కోసమే ఈ బోర్డు ప్రారంభించారని ఆయన విమర్శించారు.

ఘనంగా బోనాల సమర్పణ

నిజామాబాద్ కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే గూడ్స్ షెడ్డు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. సంఘ ప్రతినిధులు రైల్వే స్టేషన్ వద్ద గల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పు వాయిద్యాలతో బోనాలను ఊరేగించి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హమాలీ కూలీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.230	రూ.280	రూ. 300





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,000	రూ.89,400	రూ.1080

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కన్నప్ప (11.20, 3.00, 6.40, 10.20)
స్క్రీన్-2 : కుభేరా (11.40, 3.20, 7.00, 10.40)
స్క్రీన్-3 : ఎఫ్-1 ది మూవీ (తెలుగు) (10.05, 1.20)
: మార్గన్ (4.35)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (7.25, 10.40)
స్క్రీన్-4 : సితారే జమీన్ పర్ (హిందీ) (10.10, 4.30, 10.50)
: మా (హిందీ) (1.35, 7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 :కన్నప్ప (11.00, 3.40,7.10, 10.35)
స్క్రీన్-2: కుభేరా (11.00, 2.05, 7.20, 10.40)
స్క్రీన్-3 : కన్నప్ప (1.05)
: కుభేరా (4.30)
: మార్గన్ (7.45, 10.30)

దేవి: కన్నప్ప (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: కుభేరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ :మా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: మార్గన్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్